
# ట్విస్ట్ లేని కథ



వర్షాలు పడక రైతులంతా గోల పెడుతున్న రోజుల్లో అకస్మాత్తుగా జల్లు కురిసింది. నరిసిగాడికదిచికాకనిపించింది.

"వర్షం కొంచెం తగ్గితే బావుణ్ణు" గోణిగాడు

"పిడకలు ఎండిపోతే అవి అమ్మేస్తే రాత్రికి కాస్తయినా గంజినీళ్ళు కాయొచ్చు" నరిసిగాడి పెళ్ళాం

ఆ స్వార్థం వెనక ఆకలి మంటలు రాజుకుంటున్నాయి.

అటు దేశపు సరిహద్దుల్లో యుద్ధ సన్నాహాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

"బియ్యం పది లారీలు వైజాగ్‌నించి ఇమ్మీడియట్‌గా అనకాపల్లి పంపు...."

టెలిఫోన్‌లో వరహాలరాజు.

"మీ అయిడియా అర్థం కాలేదండీ." శ్రీమతి వరహాలరాజు

"అవతల యుద్ధం ఆరంభమయేట్లుంది. అనకాపల్లి మన సీక్రెట్ గోడవున్స్‌లోకి తోసేస్తే భగవంతుని దయవల్ల యుద్ధం ఆరంభమైతే అవి బియ్యంకాదు. బంగారు ముక్కలు...."

ఆ స్వార్థం వెనక ధనపిశాచి పుంజుకుంటున్నది.

తర్వాత కొన్ని సంవత్సరాలు దొర్లిపోయేయి.

పిడకలు బంగారు ముక్కలయ్యేయి. బంగారు ముక్కలు పిడకలయ్యేయి.

బంగారు ముక్కల వ్యాపారి నరసారావు. నరిసిగాడి పెళ్ళాం శ్రీమతి నరసారావు

పిడకల వ్యాపారి వరంగాడు వరహాలరాజు. శ్రీమతి వరంగాడి పెళ్ళాం. మనుషులెవరైతేనేం మళ్ళీ కథ మామూలే!

గుడిమెట్ల గోపాలకృష్ణ

# సభ్యత కోసం



నేను ఆ రోజు విజయనగరం వెళదామని బయలుదేరాను. ఆదివారం కావడం వలన బస్సు రద్దీగా ఉంటుందని అరగంట ముందుగా బస్సుస్టాండు చేరుకున్నాను. శ్రీకాకుళం— విజయనగరం బస్సు అప్పటికే స్టాండులో ఉంది. ఎలాగైతేనేమి కూర్చొనటానికి సీటు దొరికింది. ఇంచుమించు బస్సు అంతా ఫుల్ అయింది. కొంతమంది నిలుచొని ఉన్నారుకూడా.

అంతలోనే ఒక అమ్మాయి మెరుపుతీగెలా బస్సులోకి ప్రవేశించింది. తెల్లని చీర, ఎరుపు, పసుపు కలయికల బోర్డరు చీర ధరించి, మెడలో రెండు పేటల ముత్యాల గొలుసు, చేతులకు ముత్యాల గాజులు తప్ప ఇంకే రకములైన ఆభరణములు లేకుండా చిన్నబొట్టుతో సింపుల్‌గా ఉంది.

బయట ఎండగా ఉండటం వలన మొహం అంతా కంది ఎర్రగా తయారయింది. బస్సు ఎక్కగానే చేతిలో వున్న బ్రీఫ్ కేసు క్రిందపెట్టి జాగా కోసంఅటూ, ఇటూ చూసి 'ఇక తప్పదు' అన్నట్లు రాడ్ పట్టుకుని నిల్చొంది. అంత అందమైన ఆ అమ్మాయి నిల్చోవడం చూసి నాకు ఎట్లానో అనిపించింది. వెంటనే నేను నా సీటులోంచి లేచి నిలబడి కర్టెసీ కోసం ఆ అమ్మాయికి ఆఫర్ చేశాను. ఆ అమ్మాయి కాస్త ఆలోచించి కూర్చొంటూ 'థాంక్స్' అని చిరునవ్వుతో చెప్పింది.

మెల్లగా ఆ అమ్మాయితో మాటలు కలిపాను. ఇంక ఫర్వాలేదు అనిపించింది. ఈ అమ్మాయితో హాయిగా కాలక్షేపం అవుతుంది. హాయిగా నిల్చొని గమ్యం చేరవచ్చు అనిపించింది.

బస్సు బయలుదేరే సమయం కావచ్చింది ఇంకా రెండు మూడు నిముషములు మాత్రమే వుంది ఇంతలో కండక్టరు వచ్చి "అయ్యా! స్టాండింగ్ ప్యాసింజర్స్ దిగిపోవాలి. నెక్ట్స్ స్టాప్‌లో చెకింగ్ ఇన్‌స్పెక్టరు చెకింగ్ వుందం"టూ ఒక్కొక్కరినే దింపడం మొదలుపెట్టాడు. ఇంక, నా పరిస్థితి?

బి. జగదాంబ